
దోమలగూడలో బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ, ఎస్సీ మోర్చా కన్వీనర్ పరశురాం

బీజేపీని మరింత బలోపేతం చేయాలి: ఎంపీ లక్ష్మణ్

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీమోర్చా కన్వీనర్ పి.పరశురాం ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్‌లోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ హయాంలో నిరుపేదల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ పరశురాం అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ రవీందర్. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, డివిజన్ అధ్యక్షుడు నలంద్రిదిలీప్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్


లబ్ధిదారుడికి చెక్కు పంపిణీ చేస్తున్న అరవింద్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆరోగ్య సమస్యలపై పది మంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. జహీదాబేగం కు రూ. 42,500, షేక్ అన్వర్‌కు రూ. 32 వేలు, జక్క వీరేష్ రూ. 48 వేలు, జి.భాగ్యరాజ్‌కు రూ. 60 వేలు, డి.భగవాన్‌దాస్‌కు రూ. 28 వేలు, మంజీత్‌సింగ్ ఆరోరాకు రూ. 60 వేలు, పద్మకు రూ. 3 లక్షల 50 వేలు, సానియా హబీబ్‌కు రూ. 22 వేలు, ఆర్.రాము రూ.60 వేల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వారికి అరవింద్‌కుమార్‌యాదవ్ అందజేశారు.

సర్వీస్ నిబంధనలపై అవగాహన ఉండాలి : రవి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండి ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి సంఘం నాయకులకు సూచించారు. సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర కార్యాలయం దోమలగూడలోని చెన్నుపాటి భవన్‌లో ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ, సంఘ నిర్మాణం పటిష్టంగా ఉంటేనే సమస్యలు వచ్చినప్పుడు నిబద్ధతతో పోరాటం చేయగలుగుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, జిల్లా అధ్యక్షుడు రాజారావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్, నాయకులు రేణు, శారద, రమేష్ బాబు, మధుసూదన్‌రావు, కవిత, విశాలి, ప్రభాకర్, రాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

ఉద్యోగుల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వేతో అనుబంధంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులను తొలగించి ప్రైవేటీకరించాలనే ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక చట్టంలోని 44 అంశాలను తొలగించి కేవలం నాలుగు కోడ్‌లుగా విభజించడం సరైంది కాదని విమర్శించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ కోడ్‌లు పూర్తిగా అమలులోకి వస్తే కార్మికులు, ఉద్యోగుల్లో బానిసత్వం, శ్రమ దోపిడీ పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు కార్మిక, ఉద్యోగ సంఘాలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా చారి

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు చారిని నియమించినట్లు ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ అధ్యక్షుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హైటెన్షన్ వైర్లపై పడిన చెట్ల కొమ్మల తొలగింపు

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలోని బర్కత్‌పుర పార్కు చౌరస్తాలో చెట్ల కొమ్మలు విరిగి హైటెన్షన్ విద్యుత్ వైర్లపై పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సోమవారం సంఘటన స్థలానికి వెళ్లి విద్యుత్ అధికారులతో మాట్లాడి చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపట్టారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి ల్యాడర్ ద్వారా కొమ్మలను తొలగింపచేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కర్ణా మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు : ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేసిన సీహెచ్ కర్ణా మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీహెచ్ కర్ణా సంతాప సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.. ఎమ్మెల్యేగా తాను పోటీ చేసినప్పుడు అండగా నిలిచి ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా క్రమశిక్షణతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ జయేందర్‌బాబు, టీడీపీ రాష్ట్ర నాయకుడు నైషధం సత్యనారాయణ మూర్తి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు బంటారం యాదగిరి గౌడ్, బీజేపీ నాయకులు, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి: విశ్వం

ముషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గామ్‌లో పర్యటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్ విశ్వం డిమాండ్ చేశారు. భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి ముషీరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్ విశ్వం మాట్లాడుతూ.. మతం పేరుతో దాడులు చేసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను వెంటనే అరెస్టు చేసి ఉరితీయాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు బిజ్జికనకేష్ కుమార్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, పార్టీ నాయకులు మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు వంద గజాల

ఇంటి స్థలం కేటాయించాలి

- టీజీవీఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య, పలు సంఘాల నేతల డిమాండ్


ఇందిరాపార్కువద్ద నిర్వహించిన ధర్నాలో అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, టీజీవీఎస్ అధ్యక్షుడు బాకిరవి, ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎన్ రమేష్‌కుమార్ తదితరులు

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో వంద గజాల ఇంటి స్థలం కేటాయించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలను, ఇంటిని నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన న్యాయమైన డిమాండ్‌ను అమలు చేయకపోగా ప్రభుత్వ స్థలాలను అమ్మే ఆలోచన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రం పేదలకు సొంతింటి కలను నిజం చేస్తామని హామీ ఇచ్చి అన్ని విధాలా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారు చేసే న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌకలో ఇళ్లులేని ప్రతీ నిరుపేద కుటుంబానికి 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, కాచవాని సింగారం, సట్టిఅన్నారం, ఆర్‌కే నగర్ గ్రామం ఘట్‌కేసర్ మండలం మేడ్చల్ జిల్లాలో 2003 నుంచి 2004 లో ఇచ్చిన 3000 పట్టాలకు సర్వే నంబర్ 68లో 100 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గుడిసెవాసుల సంఘం (టీజీవీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ధర్నాకు తెలంగాణ గుడిసెవాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాకి రవి అధ్యక్షత వహించగా, ఆర్ కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎన్ రమేష్‌కుమార్ మాదిగ హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, గతంలో కాచవాని సింగారం, సట్టి అన్నారం, ఆర్‌కె నగర్ తదితర ప్రాంతాల గుడిసెల వాసులకు ఇళ్లపట్టాలు ఇచ్చి 3000 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. నగరంలో లక్షలాది మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో బాకి రవి, నీల వెంకటేష్, బీఎన్ రమేష్‌కుమార్, బీసీ సంఘాల నేతలు గుడిసె వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎక్కడున్నా అంబర్‌పేట ప్రజలకు అందుబాటులో ఉంటా

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సోమవారం అంబర్‌పేట డివిజన్ నరేంద్రనగర్ బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. తాను ఎక్కడ ఉన్న అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆనంద్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, నాగభూషణంచారి, మైలారం రాజు, భిక్షపతి, యశ్వంత్, కృష్ణముదిరాజ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.


నరేంద్రనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

బీజేపీలో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో కొత్తగా నియమితులైన డివిజన్ అధ్యక్షుల కుటుంబాలను ఆయన కలిశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావులతో కలిసి అంబర్‌పేట డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన నరేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను కలిశారు. అక్కడే ఆయన అల్పాహారం తీసుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నల్లకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌కు చెందిన భాగ్యమ్మ, జ్యోతి, నర్సింగ్‌రావులకు సోమవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ కార్మికులకు ఏసీ బస్సులు ప్రారంభం


ఏసీ బస్సులను ప్రారంభిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ కార్మికులకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుకు శ్రీకారం చుట్టారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వీఎస్టీ యూనియన్ ముఖ్య సలహాదారు ఆర్.డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎస్టీ కార్మికులు ప్రతి రోజు ఆజామాబాద్‌లోని వీఎస్టీ కంపెనీ నుంచి తుప్రాన్‌లో ఏర్పాటు చేసిన నూతన కంపెనీకి వెళ్లి వచ్చేందుకు నూతనంగా 5 ఏసీ బస్సులను కంపెనీచే ఏర్పాటు చేయించారు. వీటిని సోమవారం ఆర్.డి.చంద్రశేఖర్, మరో సలహాదారులు కె.రాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.డి.పాల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో కంపెనీకి చెందిన సీఎండీ విభాగం తుప్రాన్‌కు యాజమాన్యం తరలించిందని, ఆ తర్వాత దశల వారిగా కంపెనీ మొత్తాన్ని ఏడాది క్రితం తరలించిందన్నారు. అయితే కార్మికులు రోజు వెళ్లి వచ్చేందుకు వీలుగా ఏసీ బస్సు ఏర్పాటు చేయాలని అప్పటి యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డిని కోరితే పట్టించుకోలేదన్నారు. దీంతో రోజు ప్రయాణంలో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా కార్మికులకు జి.సంజీవరెడ్డి ఏసీ బస్సు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చి నేడు ఏసీ బస్సులు ప్రారంభించారని వారన్నారు.

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి


మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు సోమవారం రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గడపశ్రీహరి, ఉపాధ్యక్షులు గూడబోయిన శివరత్నం, ఆర్ కె. భగవాన్, కె.రాంచందర్, మహిళా ప్రధాన కార్యదర్శి చెర్కా సంగీత, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులకు శాపంగా మారిన జీవో 6ను వెంటనే రద్దు చేయాలని, గంగపుత్రులకు చెరువులు, కుంటలపై పూర్తి హక్కు కల్పించాలని కోరారు. తమకు రక్షణ చట్టం తీసుకురావాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ వల్ల దొంగ సొసైటీలకు లక్ష నూతన సభ్యత్వాలను ఇచ్చారని వాటిని రద్దు చేయాలని, గంగపుత్ర బెస్త, గూండ్లలకు సొసైటీ సభ్యులకు ఎలాంటి టెస్టులు పెట్టకుండా సభ్యులుగా చేర్చాలని, 18ఏళ్లు దాటిన గంగపుత్ర బెస్త గూండ్ల మహిళా సొసైటీలు, మత్స్య సహకార సొసైటీల ఏర్పాటుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. ఉచిత చేపలకు బదులుగా సొసైటీ ఖాతాలో డబ్బులు వేయాలని, నాసిరకం చేపల దళారులపై దృష్టి పెట్టాలని, ఇలా ఎన్నో సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు వారు తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసీ యాక్ట్ అమలు చేయాలి: సుదర్శన్‌గౌడ్



డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్‌ను సత్కరిస్తున్న సుదర్శన్‌గౌడ్, అసోసియేషన్ నేతలు

నల్లకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసీ యాక్ట్ 1948, సెక్షన్ 42 అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ కోరారు. సోమవారం ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ బి.రవీంద్రనాయక్‌ను అసోసియేషన్ నేతలు ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ, బస్తీ దవఖానాల్లో, పల్లె దవఖానాల్లో ఫార్మసిస్టులను నియమించాలన్నారు. ప్రతి జిల్లా డీఎంహెచ్‌ఓ ఫార్మసి స్టోర్స్‌లో రెగ్యులర్ ఫార్మసిస్ట్ గ్రేడ్ 2, గ్రేడ్ 1 పోస్టులు మంజూరు చేయాలన్నారు. ప్రతి జిల్లా టీచింగ్ ఆస్పత్రులలో ఫార్మసిస్ట్ గ్రేడ్ 1 రెండు పోస్టులు, ఫార్మసీ సూపర్‌వైజర్స్ రెండు పోస్టులు, ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 లో 12 పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

'ఉగ్రవాదంపై సహనం అవసరం లేదు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారతదేశం శాంతికాముక దేశం అయినా ఉగ్రవాదం పట్ల సహనం అవసరం లేదని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. త్యాగరాయగానసభలో ఆనంద లహరి, గానసభ ఆధ్వర్యంలో ఇటీవల జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళి, ఉగ్రవాదం పట్ల నిరసన తెలుపుతూ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులను హత్య చేయడం అమానుషం అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ భారతదేశం యావత్తూ కేంద్రప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే చర్యలకు మద్దతు ప్రకటించాయని గుర్తుచేశారు. ఆనందలహరి స్థాపకుడు వందే భారత్ సినీ నిర్మాత, దర్శకుడు మల్లం రమేష్ మాట్లాడుతూ దేశభక్తి ప్రజల్లో కలిగించేందుకు కష్టనష్టాలకు ఓర్చుకుని వందేభారత్ సినిమా తీశామని చెప్పారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు

రైలు ప్రయాణికుల బంగారు ఆభరణాల చోరీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు రైలు ప్రయాణికుల బంగారు ఆభరణాల చోరీ జరిగింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు (67) కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలై-కాచిగూడ నాగర్ కోయల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. చిట్యాల రైల్వే స్టేషన్ వద్ద భార్య హ్యాండ్ బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 వేల నగదు, ఐడీ కార్డులు ఉన్నాయి. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నల్గొండ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు. మరో సంఘటనలో కూకట్‌పల్లికి చెందిన లక్ష్మీనాగమల్లిక(38) తిరుమలై-కాచిగూడ నాగర్ కోయల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కాచిగూడకు వచ్చిన తర్వాత బ్యాగు కనిపించలేదు. దానిలో 12 గ్రాముల బంగారు ఆభరణాలు, దుస్తులు ఉన్నాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతున్న మహిళ మృతి


శారద (ఫైల్)

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న వాహనాన్ని వేగంగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైన మహిళ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన దోమలగూడ పీఎస్‌పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై అర్ధరాత్రి జరిగింది. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన అంటీర్ మధుసుదన్‌రావు ఆయన భార్య అంటీర్ శారద (50) ద్విచక్ర వాహనంపై జేబీఎస్ నుంచి మెహదీపట్నంలోని తమకుమారుడి ఇంటికి వెళ్తుండగా ట్యాంక్‌బండ్‌పైకి రాగానే వేగంగా వచ్చిన ఆ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో భార్యభర్తలు కిందపడిపోయారు. తీవ్రగాయాలపాలైన శారదను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ షేక్ అఫ్రస్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నల్లకుంట ఇన్‌స్పెక్టర జగదీశ్వర్ రావు వివరాల ప్రకారం.. సాయి చరణ్ కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ప్రాంగణంలో ఏడవ అంతస్తులో ధర్మారం శ్రీనివాసువాసులు (52) ఉంటూ దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడికి ఆర్థిక సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 7వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బోగస్ ఎన్నికలను బహిష్కరించాలి : మణికొండ

బర్కత్‌పుర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 4న నిర్వహించే ఎన్నికలకు మున్నూరుకాపు మహాసభకు ఎలాంటి సంబంధం లేదని, ఆ బోగస్ ఎన్నికలను మున్నూరుకాపులు బహిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు మణికొండ రమేష్, జితేందర్, కొండూరు వినోద్‌కుమార్, మాణిక్‌ప్రభు, కొంతం సురేష్‌బాబు, మ్యాడం రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


పురస్కారగ్రహీతలతో అతిథులు

సాంస్కృతిక రంగాల్లో సేవచేసిన వారిని గుర్తించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతికరంగాలలో వివిధ రకాల సేవచేసినవారిని గుర్తించి గౌరవించడం అవసరమని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. అలాంటివారికి సత్కరిస్తున్న రసమయి సంస్థను అభినందించారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో సాంస్కృతికరంగంలో వివిధ ప్రక్రియల్లో కృషి చేస్తున్న వీఎస్ కోటేశ్వరరావు, రామరాజు లక్ష్మీశ్రీనివాస్, డా. కావూరి శ్రీనివాస్, ఏ.ఖదీర్‌బాబు, డా.మర్రి కృష్ణారెడ్డి, డా. కేవీ జ్ఞానకుమార్‌లను సత్కరించి ఆచార్య ఇనాక్ అభినందించారు.

'విశ్వ విద్యాలయాల్లో సమస్యలను పరిష్కరించాలి'

నల్లకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రదీప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ప్రదీప్ హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులు సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల పట్ల స్పృహను కలిగి ఉండాలన్నారు. విశ్వవిద్యాలయాలు చర్చా కేంద్రాలుగా ఉన్నప్పుడే సమాజం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విస్మరిస్తుందని ఆరోపించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మొహినుద్దీన్

ముషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మొహినుద్దీన్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షాన్ నగర్‌లో ఆశ్రిత ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత భారత దేశం పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల ఏర్పడే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిర్మూలించడంతో పాటు పిల్లలకు సురక్షితమైన భవిష్యత్‌ను అందించాలన్నారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. పిల్లలతో పనులు చేయించకుండా పాఠశాలలకు పంపించి వారు ఉజ్వల భవిష్యత్‌కు నాంది పలకాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు ఆజీ పాషా, బీఆర్ఎస్ నాయకులు చాంద్‌పాషా, దిల్బర్ హుస్సేన్, ఆశ్రిత ఎన్ జీవో సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మాధవి రెడ్డి పాల్గొన్నారు.